## సైబర్ నేరాలకు చెక్ పెట్టాలంటే ముందస్తు అప్రమత్తతే ఆయుధం

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- విద్యార్థులతో కలిసి సైబర్ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ
- సైబర్ మోసం జరిగితే 'గోల్డెన్ అవర్' వ్యవధిలో 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి



వివరాలు 3లో..


# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## కరీంనగర్

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

గురువారం 08 అక్టోబర్ 2026






# ఓటు, సీటు చోరీ పేటెంట్ కాంగ్రెస్‌దే



- పటేల్‌కు బదులు నెహ్రూను ప్రధాని చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది
- ఈసీ రాజ్యాంగబద్ధ సంస్థ.. బీజేపీ జేబు సంస్థ కాదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు

2

# 27 ఏళ్ల శ్రీధర్ బాబు ప్రజా ప్రస్థానం..

## మంథని గుండెల్లో చెరగని ముద్ర

ఎమ్మెల్యేగా ఐదు పర్యాయాలు..
మంత్రిగా రెండు పర్యాయాలు..
ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు
సాగుతున్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబు..



12లో



1999లో మంథని గడ్డపై మొదలైన రాజకీయ ప్రస్థానం.. నేడు 27 ఏళ్ల సుదీర్ఘ ప్రజా ప్రయాణంగా మారింది. తొలి అడుగులోనే విజయాన్ని అందుకుని, ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. మంథని రాజకీయ చరిత్రలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేశారు. ప్రజలతో మమేకమై, నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధాన్ని కొనసాగిస్తూ సాగుతున్న ఆయన రాజకీయ ప్రస్థానం మరో కీలక మైలురాయిని చేరుకుంది..

## చామనపల్లి ముంపుపై మంత్రి అడ్లూరి దృష్టి.. బాధితులకు భరోసా

- నందిమేడారం రిజర్వాయర్ వల్ల ఎదురవుతున్న ముంపునకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని వెల్లడి
- బాధితులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించిందని ప్రకటన



4లో

## నూతన రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

- 3.35 కోట్ల నిధులతో కొలిమికుంట - మల్లన్నపల్లె బిటి రోడ్డు పనులకు శ్రీకారం



6లో

# ఓటు, సీటు చోరీ పేటెంట్ కాంగ్రెస్‌దే



## పటేల్‌కు బదులు నెహ్రూను ప్రధాని చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది

### ఈసీ రాజ్యాంగబద్ధ సంస్థ.. బీజేపీ జేబు సంస్థ కాదు

### కేంద్ర మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు



**కరీంనగర్ బ్యూరో,అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి):** ఓటు చోరీ, సీటు చోరీ పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. దేశంలో మొట్టమొదటి ఓటు, సీటు చోరీకి కాంగ్రెస్ తెరలేపిందని విమర్శించారు. దేశంలోని పీసీసీలన్నీ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను ప్రధానిగా ప్రతిపాదించినప్పటికీ, ఒక్క పీసీసీ మద్దతు లేకున్నా జవహర్‌లాల్ నెహ్రూను ప్రధానిని చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవా జ్యోతి' ర్యాలీ, 'వికసిత్ భారత్ సంకల్ప సభ'లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

**ఈసీపై బురద చల్లొద్దు**

ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తప్పు చేశారని భావిస్తే కోర్టును ఆశ్రయించాలని సూచించారు. రాజ్యాంగ సంస్థలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరమన్నారు. రాహుల్‌గాంధీ ఈసీని కలవాలనుకుంటే అపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్లాలని, వందల మందితో వెళ్లి దాడులకు పాల్పడితే పోలీసులు అడ్డుకోకుండా ఏం చేస్తారని ప్రశ్నించారు.

**అనర్హుల ఓట్లు తొలగించడమే లక్ష్యం**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ ప్రక్రియ లక్ష్యమని చెప్పారు. చనిపోయిన వారి పేర్లు కూడా ఓటర్ల జాబితాలో కొనసాగుతున్నాయని, వాటిని తొలగిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. దేశంలో పెద్ద సంఖ్యలో డూప్లికేట్, అనర్హుల ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్ నేతలే గతంలో ఆరోపించారని గుర్తుచేశారు. అలాంటి ఓట్లను తొలగించే ప్రక్రియను ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు.

**మోదీకి చోరీ చేయాల్సిన అవసరం లేదు**

ప్రధాని మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదని బండి సంజయ్ అన్నారు. మోదీకి దేశ ప్రజలే కుటుంబమని, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలపై ఆసక్తి లేదన్నారు. ప్రధాని పదవి నుంచి దిగిపోయిన తర్వాత కూడా సామాన్యుడిలా ప్రజాసేవలో కొనసాగగల మహనీయుడని కొనియాడారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే లక్ష్యంతో మోదీ పనిచేస్తున్నారని చెప్పారు.

**కాంగ్రెస్--బీఆర్ఎస్ చీకటి ఒప్పందం**

కేసీఆర్ కుటుంబ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చర్యలు రాజకీయ డ్రామాగా మారాయని బండి సంజయ్ విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు.

**పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా పనిచేస్తా**

బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు కల్పించిందని బండి సంజయ్ అన్నారు. పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని, పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని తెలిపారు. కార్యకర్తగా పార్టీ కోసం పనిచేయడమే తన లక్ష్యమన్నారు.

### మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా సోమినేని బాలుకు మెమొంటో

వేములవాడ, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): వేములవాడలో విజయవంతంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో నూకలమర్రి గ్రామానికి చెందిన జాతీయ కబడ్డీ క్రీడాకారుడు సోమినేని బాలును రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మెమొంటోతో సత్కరించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న బాలు దాదాపు 30 సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించారు. 1993లో కాకతీయ యూనివర్సిటీ తరపున తమిళనాడులో జరిగిన జాతీయస్థాయి కబడ్డీ పోటీలలో కూడా ఆయన పాల్గొనడం విశేషం. మంత్రి చేతుల మీదుగా ఈ సన్మానం అందుకోవడం పట్ల సోమినేని బాలు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.





### ముస్తాబాద్ మాల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ముస్తాబాద్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): ముస్తాబాద్ మండల మాల సంఘం నూతన అధ్యక్షుడిగా మీస శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా శ్యాగల రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా తలారి నర్సయ్య, కోశాధికారిగా గొట్టే బాలనర్సయ్య, రచయితగా మీస బాబు, కార్యవర్గ సభ్యులుగా మీస నర్సింలు, జంగం జనవ్వ ఎంపికయ్యారు. ఈ కార్యవర్గం ఏడాది పాటు పదవిలో కొనసాగుతుందని తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులకు ధన్యవాదాలు తెలిపిన మీస శ్రీనివాస్, సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

### ఎమ్మెల్యే విజయ రమణారావు సహకారంతో గ్రామాభివృద్ధి

**సర్పంచ్ గోపు రజిత**



ఎలిగేడు, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి): పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు సహకారంతో బురహాన్ మియాపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని సర్పంచ్ గోపు రజిత లక్ష్మారెడ్డి తెలిపారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన 10 నెలల్లో రూ.30 లక్షలతో మౌలిక వసతులు, నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్ మరమ్మతులు, జీపీ భవన పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే హామీ ఇచ్చిన డబుల్ రోడ్డు, మహిళా భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని అన్నారు.

### పాఠశాల బస్సుల ఆకస్మిక తనిఖీ

**నోటీసులు, జరిమానా విధింపు**

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): పాఠశాల బస్సులో విద్యార్థులను మితిమీరి తీసుకెళ్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణాశాఖ అధికారి దేవునూరి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎంవీఐ వంశీధర్ మంగళ, బుధవారాల్లో బస్సులను తనిఖీ చేశారు. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న పాఠశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయడమే కాకుండా ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాలకు చెందిన రెండు బస్సులకు జరిమానా విధించారు. బస్సుల్లో సీటు ఉంటేనే పిల్లలను పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ రమ్య, హోంగార్డు ఎల్లయ్య పాల్గొన్నారు.

## సైబర్ నేరాలకు చెక్ పెట్టాలంటే ముందస్తు అప్రమత్తతే ఆయుధం

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- విద్యార్థులతో కలిసి సైబర్ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ
- సైబర్ మోసం జరిగితే 'గోల్డెన్ అవర్' వ్యవధిలో 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి



వేములవాడ, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) ఆదేశాల మేరకు ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా అగ్రహారంలోని జేఎన్టీయూహెచ్ కళాశాలలో జిల్లా సైబర్ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా హాజరై సైబర్ నేరాల నివారణపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సాంకేతికత పెరిగిన కొద్దీ సైబర్ నేరాలు కొత్త రూపాల్లో విస్తరిస్తున్నాయని, వాటి బారిన పడకుండా ఉండటానికి ముందస్తు అప్రమత్తతే ప్రధాన ఆయుధమని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని, ఫోటోలను ఇతరులతో పంచుకోవద్దని, నకిలీ లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లక్కీ డ్రాల పేరిట వచ్చే మోసపూరిత సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్యంగా సైబర్ మోసానికి గురైన గంట వ్యవధిలో (గోల్డెన్ హావర్) టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. సదస్సులో సైబర్ క్రైమ్ ఆర్.ఎస్.ఐ జునైద్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా లోన్ యాప్స్, డిజిటల్ అరెస్ట్, షేర్ మార్కెట్, క్రిప్టో కరెన్సీ మోసాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సి.ఐ వీరప్రసాద్, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు, సైబర్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.



## డిజిటల్ క్రాప్ సర్వేను పరిశీలించిన తహసీల్దార్ యాకన్న

- ఎలిగేడు మండలం బురహాన్‌మియాపేటలో 600 ఎకరాల్లో సర్వే పూర్తి
- రైతులు సమాచారం అందించి సర్వేను విజయవంతం చేయాలని తహసీల్దార్ విజ్ఞప్తి



ఎలిగేడు, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి): ఎలిగేడు మండలంలోని బురహాన్‌మియాపేట గ్రామంలో గత నెల రోజులుగా కొనసాగుతున్న డిజిటల్ క్రాప్ సర్వేను ఎలిగేడు తహసీల్దార్ యాకన్న, గ్రామ సర్పంచ్ రజిత లక్ష్మారెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్, సర్వే వేగవంతంపై అధికారులకు పలు సూచనలు చేశారు. బురహాన్‌మియాపేటలో మొత్తం ఉన్న 937 ఎకరాల వ్యవసాయ భూమిలో ఇప్పటివరకు 600 ఎకరాల్లో సర్వే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ యాకన్న మాట్లాడుతూ.. డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా పంటల వివరాలను పక్కాగా క్షేత్రస్థాయిలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో మిగిలిన భూముల సర్వేను రాబోయే పది రోజుల్లోగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు తమ వ్యవసాయ భూములు, వేసిన పంటల వివరాలను సర్వే సిబ్బందికి అందజేసి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. రైతుల భాగస్వామ్యంతోనే సర్వే సజావుగా, ఖచ్చితంగా పూర్తవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపు రజిత లక్ష్మారెడ్డి, రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## లాల్లపల్లిలో ఘనంగా పోషణ మాస వారోత్సవాలు

ఎలిగేడు, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): ఎలిగేడు మండలంలోని లాల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాస వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సర్పంచ్ ఏలేటి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా గర్భధారణ నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు (మొదటి 1000 రోజులు) తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆకుకూరలు, పండ్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



# చామనపల్లి ముంపుపై మంత్రి అడ్లూరి దృష్టి.. బాధితులకు భరోసా

- నందిమేడారం రిజర్వాయర్ వల్ల ఎదురవుతున్న ముంపునకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని వెల్లడి
- బాధితులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించిందని ప్రకటన



**ధర్మారం, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి):**
నందిమేడారం రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరగడంతో చామనపల్లి గ్రామంలో నెలకొన్న ముంపు సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన చామనపల్లి గ్రామాన్ని సందర్శించి, గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ముంపు బాధితులు, స్థానికులతో మాట్లాడారు. అనంతరం అధికారులతో కలిసి ముంపు ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చామనపల్లి ముంపు సమస్యను సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఈ సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు, ఉపసర్పంచ్ తీగుళ్ల కవిత సతీష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రూప్లా నాయక్, తహసీల్దార్ డి. శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## 'కొరకొప్పుల' కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు



**రామగిరి, అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి) :**
మండలంలోని సుందిల్ల గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ కొరకొప్పుల సత్యనారాయణగౌడ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పత్తిపాక పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



**ధర్మారం, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి):**
మండలంలోని పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో ఆధునిక సాంకేతికతతో ఏర్పాటు చేసిన కృత్రిమ మేధస్సు (ఏఐ) కంప్యూటర్ ల్యాబ్‌ను అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పీఎం షేక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైతం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సాంకేతిక పరిజ్ఞానం పొందాలన్నారు. చిన్న వయస్సు నుంచే ఏఐపై అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెరుగుతాయని తెలిపారు.ఏఐ ల్యాబ్ ద్వారా తెలుగు, ఇంగ్లిష్, గణితంతో పాటు బొమ్మలు గీయడం, కథలు రాయడం, వివిధ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవడం వంటి అంశాలను విద్యార్థులు కంప్యూటర్ ద్వారా నేర్చుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులతో ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగపూర్ విద్యా వ్యవస్థ పరిశీలనకు వెళ్లి తిరిగి వచ్చిన డాక్టర్ పీఎం షేక్‌ను గ్రామపంచాయతీ పాలకవర్గం, ఉపాధ్యాయ బృందాలు శాలువాతో ఘనంగా సన్మానించాయి. కార్యక్రమంలో సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్, ఉపసర్పంచ్ పూసాల మల్లేశం, హెచ్‌ఎం నూతి మల్లన్న, కాంప్లెక్స్ హెచ్‌ఎం సరిత, పంచాయతీ కార్యదర్శి తాళ్ల కిరణ్, సీఆర్‌పీ ఎదుల్ల ప్రేమ్ సాగర్, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## నిర్దేశిత సమయంలో 4వ లాంగ్‌వాల్ ప్యానెల్ పూర్తి చేయాలి

- డైరెక్టర్ (పా) కొప్పుల వెంకటేశ్వర్లు

రామగిరి, అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి) :
అడ్రియాల లాంగ్‌వాల్ గనిలో 4వ ప్యానెల్ పనులను భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం అడ్రియాల గనిని సందర్శించిన ఆయన 3వ ప్యానెల్ సాల్వేజింగ్ పనులు పూర్తిచేసిన సిబ్బందిని అభినందించారు. అనంతరం 4వ ప్యానెల్ పనుల పురోగతిపై సమీక్షించి, భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వెన్సర్ కంపెనీ పనుల పురోగతిపై కూడా సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్జీ-3 జీఎం సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జీఎం కొలిపాక నాగేశ్వరరావు, కార్పొరేట్ అధికారులు, ఏరియా అధికారులు, వెన్సర్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



## దామోదర్ యాదవ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు కొనసాగించాలి.

మండల విద్యాధికారి ప్రభాకర్

**ధర్మారం, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి):**
కొలుముల దామోదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో 117 మంది విద్యార్థులకు కంటి అద్దాలను బుధవారం పంపిణీ చేశారు. కొత్తూరుకు చెందిన కొలుముల దామోదర్ యాదవ్ ఎన్నారై కెనడా సౌజన్యంతో తన చిన్న కూతురు ధాత్రి జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ పోతు ప్రభాకర్ విద్యార్థులతో కేక్ కట్ చేయించి,కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదర్ యాదవ్ మండలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు భవిష్యత్తులో సేవా గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ, పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సుంచు మల్లేశం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గంధం మంగ మహిపాల్, వైస్ చైర్మన్ మెట్పల్లి తిరుమల నరేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో ఉండాలి.. మెరుగైన వైద్యం అందించాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

- వేములవాడ మండలం హనుమాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా ఏఎన్ఎంలు కృషి చేయాలని ఆదేశం



వేములవాడ, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి): వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మండలం హనుమాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపీ రిజిస్టర్, ల్యాబ్, ఇమ్యూనైజేషన్ రూమ్, ఇన్-పేషెంట్ వార్డులు, ఫార్మసీని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, నిత్యం ఎంతమంది ఓపీకి వస్తున్నారనే వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు అప్రమత్తంగా ఉంటూ గర్భిణుల ఏఎన్సీ రిజిస్ట్రేషన్లు, వారి ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాల సంఖ్య పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బీపీ, షుగర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ఎన్సీడీ స్క్రీనింగ్‌ను వేగవంతం చేయాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆసుపత్రి



పరిసరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ భారీ నిరసన ర్యాలీ

## గోదావరిఖనిలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దహనం

ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు డిమాండ్



గోదావరిఖని, సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి): ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రధాన చౌరస్తా నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివెళ్లిన నాయకులు, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబులతో కలిసి మాట్లాడారు. ఓట్ల సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్ అధ్యక్షుడు ఎండీ ముస్తఫా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు (సీపీఐ, సీపీఐ ఎంఎల్), ఐఎన్‌టీయూసీ మరియు వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు



# లో వోల్టేజీతో మోటార్లు దగ్ధం

పంటలు ఎండిపోతున్నాయని ధర్మారంలో రైతుల రాస్తారోకో

కోనరావుపేట, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): కోనరావుపేట మండలం ధర్మారంలో విద్యుత్ కోతలు, లో వోల్టేజ్ సమస్యతో మోటార్లు కాలిపోతుండటంతో బుధవారం రైతులు సిరిసిల్ల - నిమ్మపల్లి ప్రధాన రహదారిపై కాలిపోయిన మోటార్లతో రాస్తారోకో నిర్వహించారు. పంటలు ఎండిపోతుండటంతో అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

## జోన్-2లో తాగునీటి సమస్యకు పరిష్కారం



రామగిరి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): రామగిరి మండలం పన్నూరు పంచాయతీ పరిధిలోని సింగరేణి జోన్-2 క్వార్టర్స్‌లో ఎదురవుతున్న తాగునీటి ఎద్దడికి పరిష్కారం లభించింది. సర్పంచ్ చిందం మహేష్ ఆధ్వర్యంలో వార్డు సభ్యుల సహకారంతో రెండు నూతన బోర్లను ఏర్పాటు చేశారు. దీంతో కార్మికులు, వారి కుటుంబాల నీటి ఇబ్బందులు తొలగిపోనున్నాయి. సమస్యపై తక్షణమే స్పందించి బోర్లు వేయించిన సర్పంచ్‌కు సింగరేణి కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సమ్మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరి పాల్గొన్నారు.

## ఉద్యమ నిరుద్యోగ కళాకారుల డిమాండ్లు నెరవేర్చాలి

డాక్టర్ దాసరి మమతా రెడ్డి



పెద్దపల్లి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నిరుద్యోగ కళాకారుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి డిమాండ్ చేశారు. సాంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ కళాకారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు బుధవారం ఆమె సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే బీఆర్ఎస్ తరఫున పోరాటానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు.

ప్రజాజ్యోతి

గురువారం 08 అక్టోబర్ 2026

## భూపాలపట్నం బ్రిడ్జికి రూ. 1.57 కోట్లు మంజూరు



చొప్పదండి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): చొప్పదండి మండలంలోని భూపాలపట్నం నుండి వెదురుగట్ట వెళ్లే దారిలో శిథిలావస్థకు చేరి కుంగిపోయిన బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ. 1.57 కోట్లు మంజూరైనట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయన నాయకత్వంలో చొప్పదండి మండలం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## భూపాలపట్నం - వెదురుగట్ట బ్రిడ్జికి రూ. 1.57 కోట్లు మంజూరు



చొప్పదండి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): చొప్పదండి మండలంలోని భూపాలపట్నం నుండి వెదురుగట్ట వెళ్లే దారిలో ప్రమాదకరంగా మారిన పాత బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ. 1.57 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బ్రిడ్జి కుంగిపోయి ఇబ్బందులు పడుతున్న రైతులు, వాహనదారుల కష్టాలను గుర్తించి నిధులు మంజూరు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలో చొప్పదండి నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు.



## నాగేపల్లిలో నిక్షయ్ శివిర్

రామగిరి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): రామగిరి మండలంలోని నాగేపల్లి గ్రామ పంచాయతీలో క్షయ వ్యాధి (టీబీ) ముందస్తు గుర్తింపు కోసం బుధవారం నిక్షయ్ శివిర్ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొండవెన దివ్యసుధాకర్ యాదవ్ హాజరై ఛాతీ ఎక్స్‌రే పరీక్షల నిర్వహణను పరిశీలించారు. దీర్ఘకాలిక దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాసం సతీష్, కార్యదర్శి స్వప్న, ఏఎన్ఎం రాణి తదితరులు పాల్గొన్నారు.

# నూతన రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

- **3.35 కోట్ల నిధులతో కొలిమికుంట - మల్లన్నపల్లె బిటి రోడ్డు పనులకు శ్రీకారం**
- **స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**



చొప్పదండి, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి): చొప్పదండి మండలం కొలిమికుంట నుండి మల్లిఖార్జున స్వామి ఆలయం మీదుగా మల్లన్నపల్లె వరకు 3.35 కోట్ల నిధులతో చేపట్టనున్న నూతన బిటి రోడ్డు నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కొలిమికుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు మరియు కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ పాలన సాగిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, కొలిమికుంట గ్రామ సర్పంచ్ చొక్కల్ల తిరుపతి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ పంజాల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ నెరువట్ల మల్లేశం, సింగిల్ విండో వైస్ చైర్మన్ నిజానపురం చందు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.జి.ఎఫ్.ఐ జూడో పోటీలకు పారమిత విద్యార్థులు ఎంపిక



- **హన్మకొండలో జరగనున్న 70వ రాష్ట్ర స్థాయి జూడో ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక**
- **విద్యార్థులు ఎ. శష్విత్ రెడ్డి, వి. కుషాల్‌లను అభినందించిన చైర్మన్ ప్రసాదరావు**

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి): తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న 70వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి జూడో పోటీల్లో 10వ తరగతికి చెందిన ఎ. శష్విత్ రెడ్డి (81 కేజీ), వి. కుషాల్ (90o కేజీ)లు బాలుర అండర్-17 విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ విజయం సాధించిన ఇద్దరు విద్యార్థులు హన్మకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి జూడో ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావుతో పాటు డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, కె. హన్మంతరావు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రావీణ్యం చాటి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గోపీకృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రబీంద్రపాత్రో, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. రాజు, గోలి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలకు దాతల సాయం

చొప్పదండి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): చొప్పదండి మండలం చాకుంట ప్రాథమిక పాఠశాలకు దాతల సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి (ఎంఈఓ) జ్యోతి అన్నారు. పాఠశాలకు దాతలు కుర్చీలు, స్టీల్ ప్లేట్లు, వాటర్ బాటిళ్లు, వాటర్ గ్లాసులు, సౌండ్ సిస్టమ్, స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. దాతలను అభినందించిన ఎంఈఓ, ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పురం మాధవి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం: వెలిచాల రాజేందర్ రావు

- ఎలక్షన్ కమిషన్ బిజెపి ఏజెంట్‌లా వ్యవహరిస్తోందని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కరీంనగర్ కాంగ్రెస్ ఇంచార్జ్ డిమాండ్



కరీంనగర్ టౌన్, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి): ఓటరు జాబితాల సవరణ పేరుతో దేశంలో ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసే పరిస్థితులు నెలకొంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులపై ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కేసి వేణుగోపాల్‌లతో పాటు 'ఇండియా' కూటమి ఎంపీలను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బుధవారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఓటు అనేది దేశ భవిష్యత్తును నిర్ణయించే ఆయుధమని, ఓటర్ల హక్కులపై ప్రతిపక్షాలు లేవనెత్తే సందేహాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ప్రజాస్వామ్యానికి కాపలాదారుగా ఉండాల్సిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బీజేపీ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సీఈసీ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, పారదర్శకమైన ఓటు హక్కును కాపాడే వరకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని రాజేందర్ రావు పేర్కొన్నారు.

# ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపొద్దు

## సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



కరీంనగర్ టౌన్, అక్టోబర్ 7(ప్రజాజ్యోతి ) ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సీపీఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమయంలో విద్యుత్ చార్జీల భారాన్ని మరింత పెంచడం ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. ప్రజల నుంచి వివిధ రకాల పేర్లతో విద్యుత్ చార్జీలు వసూలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ట్రూ అప్ చార్జీల నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగంలో తీసుకునే నిర్ణయాలు సామాన్య ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉండాలని అన్నారు. ప్రజలపై అదనపు విద్యుత్ భారాన్ని మోపే నిర్ణయాన్ని విరమించుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలను చేపడతామని మిల్కూరి వాసుదేవరెడ్డి హెచ్చరించారు. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# రవీంద్రభారతిలో సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం

- రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీకి ఘన సత్కారం, ఐడీ కార్డులు, మెమొంటోల అందజేత
- పారదర్శక పాలనకు ఆర్టీఐ చట్టం కీలకమని రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ వెల్లడి



ముస్తాబాద్, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి): సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఆర్టీఐ-2005 ఆవిర్భావ దినోత్సవం, అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో ఆర్టీఐ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చంటి ముదిరాజు, జాతీయ, రాష్ట్ర నాయకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ, మండల స్థాయిల్లో ప్రజలను చైతన్యపరుస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీకి ప్రత్యేక గౌరవం లభించింది. జిల్లా కమిటీ నూతన సభ్యులను, కార్యవర్గాన్ని సమాచార కమిషనర్ దేశాల భూపాల్, చైర్మన్ చంటి ముదిరాజుల చేతుల మీదుగా శాలువాలతో ఘనంగా సత్కరించి, ఐడీ కార్డులు మరియు మెమొంటోలను అందజేశారు. సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పులి మధుకర్ నాయకత్వంలో జిల్లా, ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రజా హక్కుల పరిరక్షణకు, ఆర్టీఐ చట్టంపై విస్తృత అవగాహనకు నిరంతరం కృషి చేస్తామని జిల్లా నాయకత్వం తెలిపింది.



## ఎమ్మెల్సీ పదవి "సంగీతం" కు ఇవ్వాలి: వంగా గిరిధర్ రెడ్డి

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి వంగా గిరిధర్ రెడ్డి బుధవారం ఎల్లారెడ్డిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నెల సిరిసిల్ల బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పద్మశాలిలకు ఎమ్మెల్సీ ఇస్తామని ప్రకటించిన దృష్ట్యా, ఆ పదవిని సంగీతం శ్రీనివాస్‌కు కేటాయించాలని కోరారు. గత 25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ, పద్మశాలిల సంక్షేమానికి విశేష సేవలు అందించిన శ్రీనివాస్‌కు అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. సంగీతం శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం స్థల పరిశీలన



ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో బుధవారం హరిదాస్‌నగర్ ఊరగుట్టపై జిల్లా, రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. పాఠశాల నిర్మాణానికి అనువైన స్థలంపై అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పాఠశాల ఏర్పాటుకు అనుకూలమైన ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిదాస్‌నగర్ సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవ్, తిప్పరవేణి రాజయ్య, గుల్లపెల్లి శ్రీకాంత్, మద్దుల పద్మారెడ్డి, వంగ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేను సైతం కవితక్క తెలంగాణ రక్షణ సేనలో

### 90 ఏళ్ల వృద్ధురాలి చేరిక



సిరిసిల్ల, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలో బుధవారం తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. నియోజకవర్గ ఇన్‌చార్జ్ మజీద్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 90 ఏళ్ల వృద్ధురాలు మాదారపు వెంకటవ్వ స్వచ్ఛందంగా వచ్చి పార్టీ కండువా కప్పుకోవడం విశేషం. వృద్ధురాలి ఉత్సాహాన్ని అభినందించిన మజీద్, రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో తమ పార్టీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- మల్లాపూర్ గిరిజన మినీ గురుకులం, ఆదర్శ పాఠశాలల్లో కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలన
- విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందించాలని అధికారులకు ఆదేశం




**మల్లాపూర్, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి):** మండలంలోని గిరిజన మినీ గురుకులం, ఆదర్శ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, మౌలిక వసతులు, భోజనం నాణ్యత, తాగునీరు మరియు పారిశుద్ధ్య నిర్వహణను ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలోని సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం, భద్రత కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు బోధనా ప్రమాణాలు పెంచి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పల్లికొండ నరేష్, జిల్లా విద్యాధికారి కె.రాము, తహసీల్దార్ రాంచందర్, ప్రిన్సిపాల్ భూమేష్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే ఆర్థిక అవగాహన అవసరం

## టీజీబీ బ్యాంక్ మేనేజర్ విక్రమ్

- బీర్పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బ్యాంకింగ్ అవగాహన సదస్సు, 'స్వచ్ఛత హీ సేవ'
- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, బాధితులు 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచన




**బీర్పూర్, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి):** బీర్పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (ఎ+డీ) ఆధ్వర్యంలో బ్యాంకింగ్ అవగాహన సదస్సు, 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజీబీ బ్యాంక్ మేనేజర్ విక్రమ్, సీఎఫ్ఎల్ అధికారి విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థి దశ నుంచే ఆర్థిక అవగాహన, క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, అనధికారిక లింక్‌లు ఓపెన్ చేయకూడదని, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పకూడదని హెచ్చరించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ పథకాలు, ఆర్బీఐ 'ఉద్గమ్ పోర్టల్', డిజిటల్ లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కౌన్సిలర్ సౌజన్య, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### ఆవునూరులో టీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు

**ముస్తాబాద్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలో బుధవారం టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. స్థానిక నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ మజీద్ ముఖ్యఅతిథిగా హాజరై, పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా 90 ఏళ్ల వృద్ధురాలు మాదారపు వెంకటవ్వ సైతం స్వయంగా వచ్చి పార్టీలో చేరడం విశేషమని, కవితక్క నాయకత్వానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని మజీద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లే శంకర్, దేవరాజు, చిన్ని బాల్‌రెడ్డి, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



### నీటి విడుదలతో పంటలకు ప్రాణవాయువు: రైతుల హర్షం

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా మలకపేట రిజర్వాయర్ నుండి 9వ ప్యాకేజీ కాలువ ద్వారా బుధవారం నీటి పారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేయడంతో ఎల్లారెడ్డిపేట మండల సర్పంచులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాలువ వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించిన అనంతరం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ.. ఈ నీటి విడుదల ద్వారా మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో నీరందక ఎండిపోతున్న 2,300 ఎకరాల వరి పంట కాపాడబడిందని తెలిపారు. రైతుల ఇబ్బందులను గుర్తించి నీటి విడుదలకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక సర్పంచులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికుడి ఆత్మహత్యాయత్నం



**కోనరావుపేట, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో పురుషాని దేవరాజు అనే పంచాయతీ కార్మికుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నెల రోజుల క్రితం ఎలాంటి కారణం లేకుండా తనను విధుల నుంచి తొలగించడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. ఉపాధి కోల్పోయి కుటుంబాన్ని పోషించడం భారంగా మారడమే దీనికి కారణమని కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

### మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు



**రాయికల్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేట ప్రభుత్వ పాఠశాల 2001-02 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు తోటి స్నేహితుడికి ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు శస్త్రచికిత్స చేయించుకున్న తమ మిత్రుడు రవీందర్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం మిత్రులంతా కలిసి రూ.21,000 సేకరించి అందజేశారు. కష్టసమయంలో తోటి స్నేహితుడికి అండగా నిలిచిన మిత్ర బృందాన్ని గ్రామస్థులు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్నేహితుల బృందం సభ్యులు వాసరి రవి, ద్యాగ రమేష్, జీవన్ రెడ్డి, గంగారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణుల ఆరోగ్యానికే సర్కార్ పెద్దపీట

- పేదలకు వైద్యం దూరం కాకూడదన్నదే లక్ష్యం
- సాతారంలో నూతన ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం



**మల్లాపూర్, అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి):** గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.

**గ్రామాల్లోనే ప్రాథమిక వైద్య సేవలు**

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ.. చిన్నపాటి అనారోగ్య సమస్యలకు సైతం ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లే కష్టాన్ని తప్పించేందుకే గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్యం అందేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. రోగం వచ్చాక చికిత్స తీసుకోవడం కంటే, ముందుగానే గుర్తించి నివారించడం ముఖ్యమని పేర్కొన్నారు.

**అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి**

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ సాతారం వాసులకు ఇకపై ప్రాథమిక వైద్యం మరింత చేరువవుతుందని తెలిపారు. వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కోరుట్ల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు పేర్కొన్నారు. గ్రామస్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహారావు, డీఎంహెచ్‌వో సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, తహసీల్దార్ రాంచందర్, మండల వైద్యాధికారిణి వాహిని రావ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాట్ల సోమయ్య, గ్రామ సర్పంచ్ పోతవేణి నారాయణ గౌడ్, ఎంఎల్ హెచ్ పి సరిత, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## అనారోగ్యంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి



**పెద్దపల్లి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** ఓదెల మండల కేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కొమ్ము బిక్షపతి (57) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. నిరుపేద కుటుంబానికి చెందిన బిక్షపతి మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొనగా, స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య శంకరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



**పెద్దపల్లి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** పెద్దపల్లి జిల్లాలోని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న 11 పీఎం శ్రీ పాఠశాలల్లో ఐదు నెలల కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్స్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద బుధవారం తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ ధ్రువపత్రాల దరఖాస్తులను ఈ నెల 10వ తేదీలోగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లేదా ప్రిన్సిపాళ్లకు సమర్పించాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని తెలిపారు.

## సైబర్ నేరాల్లో అప్రమత్తతే ముఖ్యం

**వేములవాడ రూరల్ ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి**



**వేములవాడ, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** సైబర్ జాగరూకత దివస్ సందర్భంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టెంల గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి అవగాహన కల్పించారు. ఫేక్ అకౌంట్లు, లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు చేసే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని ఆయన హెచ్చరించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసి బాధితులు తమ సొమ్మును కాపాడుకోవచ్చని తెలిపారు.

## పాఠశాలకు అదనపు తరగతి గదులకై మంత్రికి వినతి

**కోరుట్ల, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సాతారం గ్రామంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ధర్మారం గ్రామ సర్పంచ్ రంజిత్ రెడ్డి బుధవారం కలిశారు. ధర్మారం ప్రభుత్వ పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేయడంతో పాటు గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వినతులపై సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఓసీ నాయకులకే కేటాయించాలి



**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** రాచర్ల బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఓసీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకులకే కేటాయించాలని ఎల్లారెడ్డిపేట మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు కుంభాల సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓసీ కేటగిరీకి సుమారు 20 సంవత్సరాల తర్వాత రిజర్వేషన్ అవకాశం వచ్చిందని, ఈ పదవిని ఓసీ వర్గానికే ఇవ్వాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర కాంగ్రెస్ నాయకులకు లేఖలు రాసినట్లు తెలిపారు. పార్టీ కోసం సుదీర్ఘకాలంగా శ్రమిస్తున్న సీనియర్లను గుర్తించి పదవి ఇవ్వాలని, జూనియర్లకు కట్టబెట్టడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో రెడ్డి సంఘం ప్రతినిధులు గోగురి శ్రీనివాస్ రెడ్డి, జంగా అంజిరెడ్డి, గన్న మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

**వేములవాడ, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కమిషనర్ శ్రీమతి బాల మాయాదేవి (ఐఏఎస్) కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. భీమేశ్వర వసతి గృహానికి చేరుకున్న ఆమెకు వేములవాడ ఆర్డీవో కె.ఎస్.బి. కుమారి స్వాగతం పలికారు. ఆలయంలో భీమేశ్వర స్వామికి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రిన్సిపల్ సెక్రటరీ, క్షేత్ర సంప్రదాయం ప్రకారం కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

## ముస్కాన్ పేటలో రెండు ఆలయాల్లో చోరీ



**ఇల్లంతకుంట, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం ముస్కాన్ పేట గ్రామంలోని రెండు ఆలయాల్లో బుధవారం చోరీ జరిగినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో హుండీ పగలగొట్టి రూ.3,000 నగదును, ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి పుస్తెలు, మట్టెలు, వెండి కళ్లు మరియు హుండీ డబ్బులు కలిపి సుమారు రూ.5,000 విలువైన సొత్తును దుండగులు అపహరించారు. ఆలయ అర్చకుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆలయాల్లో దొంగతనం జరగడంతో స్థానిక గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## వేములవాడలో 98 శాతం పూర్తయిన 'సర్' ప్రక్రియ: ఆర్డీఓ కుమారి

**వేములవాడ, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):**
వేములవాడ నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ 98 శాతం పూర్తయి చివరి దశకు చేరిందని, తుది ఓటర్ల జాబితాను నవంబర్ 9న అధికారికంగా ప్రచురించనున్నట్లు ఆర్డీఓ కె.ఎస్.బి.కుమారి తెలిపారు. బుధవారం సాయంత్రం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష నేతల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలోని మొత్తం 2,29,132 ఓటర్లకు గాను 2,02,323 మంది అర్హులుగా తేలారని, మిగతా 26,809 మంది డబుల్, షిఫ్టెడ్ మరియు మరణించిన ఓటర్లని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పొలాస నరేందర్, మైలారం రాము, కడారి రాములు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# జగిత్యాలలో ఘనంగా వికసిత్ భారత్ సంకల్ప సభ, సేవా జ్యోతి యాత్ర

- మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్
- 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనలో ప్రజా భాగస్వామ్యం కీలకం
- డాక్టర్ వి. మురళీధర్ గౌడ్



**జగిత్యాల, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి):**
భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా బుధవారం జగిత్యాల పట్టణంలో వికసిత్ భారత్ సంకల్ప సభ, సేవా జ్యోతి యాత్రలను ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలన, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ముందుగా ఎస్వీఎల్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సంకల్ప సభలో ప్రధాని మోదీ వీడియో ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం అక్కడ నుండి తహశీల్ చౌరస్తాలోని అంబేద్కర్ కూడలి వరకు సేవా జ్యోతి పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ వి. మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించడమే ధ్యేయమని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, ఇన్‌చార్జి గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు వడ్డేపల్లి శ్రీనివాస్, నలవాల తిరుపతి, పిల్లి శ్రీనివాస్, మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైద్య విద్యకు ఆర్థిక చేయూత

## అంజలికి 25 వేల సాయం

- ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పుప్పాల శ్రీనివాస్ అండ
- వైద్య విద్యలో రాణించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్ష



**రాయికల్, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి):**
రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన కనికరపు అంజలి ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో రామగుండం సింగరేణి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న బీజేపీ జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి, రిటైర్డ్ డిసిటి పుప్పాల శ్రీనివాస్ ఆమెకు అండగా నిలిచారు. బుధవారం అంజలికి ₹25,000 ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఈ సందర్భంగా పుప్పాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంజలి వైద్య విద్యలో ఉన్నతంగా రాణించి భవిష్యత్తులో సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు కొనియాడారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూరేళ్ల ప్రశాంత్, ఆకుల మహేష్, ఏనుగు ముత్యం రెడ్డి, జంబర్తి దివాకర్, వట్టిమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**రామగిరి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):**
సెంటినరీ కాలనీ సమీపంలోని సింగరేణి ఆర్జీ-3 ఓసీ-1 ఫేజ్-2 ఆవరణలో ఉన్న శ్రీ భద్రకాళీ దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ సముద్రాల విజయసారథి తెలిపారు. 11 రోజుల పాటు అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, కుంకుమార్చనలతో పాటు చండీ హోమం, లలితా సహస్రనామ పారాయణలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ప్రతిరోజూ ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకుని పూజల్లో పాల్గొనాలని కోరారు.



## బీర్‌పూర్‌లో అడిషనల్ డీఆర్‌డీఓ మదన్ మోహన్ విస్తృత పర్యటన



- తుంగూర్ గ్రామంలో పారం పాండ్, నూతన జీపీ భవన నిర్మాణ పనుల పరిశీలన
- ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని, పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు ఆదేశం

**బీర్పూర్, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి):** జగిత్యాల జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓ మదన్ మోహన్ బుధవారం బీర్‌పూర్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా తుంగూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిధులతో చేపడుతున్న పారం పాండ్ పనులను, నూతన పంచాయతీ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, ఈజీఎస్ (జు+టా) సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉపాధి హామీ కూలీల హాజరు శాతం, నూతన పనుల గుర్తింపు, జీపీ పరిపాలనాంశాలపై చర్చించారు. మండలంలో ఉపాధి హామీ పనులను తక్షణమే ప్రారంభించి కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని, పాలనను పారదర్శకంగా మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఏపీఓ, ఎంపీఓ, తుంగూర్ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# కంపెనీ ఆస్తులు.. అందరి బాధ్యత

### ఆర్జీ-3 జీఎం సుంకర మధుసూదన్

**రామగిరి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** సింగరేణి సంస్థకు చెందిన భూములు, భవనాలు, యంత్రాలు తదితర ఆస్తులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్జీ-3 ఏరియా జీఎం సుంకర మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ఆస్తుల దురాక్రమణ, నష్టం లేదా దుర్వినియోగాన్ని గుర్తిస్తే వెంటనే యాజమాన్య దృష్టికి తీసుకురావాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఇటీవల సెంటినరీ కాలనీలో ఆక్రమణకు గురైన స్థలాన్ని విచారణ చేపట్టి తిరిగి సంస్థ ఆధీనంలోకి తీసుకున్నామని, ఆధారాలు లేకుండా అధికారులపై ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. సంస్థకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా జీఎం హెచ్చరించారు.



## పీహెచ్‌సీలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి: డీఎంహెచ్‌ఓ డాక్టర్ పవిత్ర
- ధర్మారం పీహెచ్‌సీలో వేడుకగా బతుకమ్మ వేడుకలు; పాల్గొన్న మహిళా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు

**ధర్మారం, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (గ్రాఎజ) బుధవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ సుష్మిత ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ పవిత్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు రంగురంగుల సహజ సిద్ధమైన పుష్పాలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలతో ఆటపాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ పవిత్ర మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ప్రకృతితో మానవాళికి ఉన్న అనుబంధాన్ని చాటిచెబుతుందన్నారు. ప్రకృతి ప్రసాదించిన పూలతో బతుకమ్మను పేర్చడం తెలంగాణ విశిష్ట సంస్కృతి అని, తయారీలో కృత్రిమ రసాయన రంగులను కాకుండా సహజ సిద్ధమైన పూలనే వాడాలని సూచించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంతో పాటు మన సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ వేడుకల్లో సీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ రాజు, టీబీ డిస్ట్రిక్ట్ పీహెచ్ఎం విజయలలిత, హెచ్‌యూ నర్సింహారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## గేదెను ఢీకొని యువకుడి మృతి



**కొడిమ్యాల, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** గేదెను ద్విచక్రవాహనంతో ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన విషాద సంఘటన కొడిమ్యాల మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నాచుపల్లి గ్రామానికి చెందిన జిట్టవేణి మధుసూదన్ (30) బుధవారం సాయంత్రం నర్సింగ్ కోర్సు చదువుతున్న తన భార్యను బస్సు స్టేజీ వద్ద నుంచి ఇంటికి తీసుకువచ్చేందుకు బైక్‌పై వెళ్తుండగా నాచుపల్లి-దొంగలమర్రి రహదారిపై గేదె అడ్డురావడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం జగిత్యాల సివిల్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇటీవలే వివాహమైన మధుసూదన్ హఠాన్మరణంతో నాచుపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.



## రైతులకు సకాలంలో సేవలందించాలి

### ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్

**రాయికల్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** రైతులకు అవసరమైన సేవలను సకాలంలో అందిస్తూ వారి సంక్షేమానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) కృషి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. రాయికల్ మండలం ఇటిక్యాలలో బుధవారం నిర్వహించిన పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మర్రిపల్లి శ్రీనివాస్‌గౌడ్, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, రైతుల సమస్యల పరిష్కారంలో సహకార సంఘాలు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ రవీంద్రరావు, పీఏసీఎస్ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత: రేంజ్ అధికారి శ్రీనాథ్

**బీర్ పూర్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలంలోని చిత్రవేణిగూడెం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ధర్మపురి అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీనాథ్ ఆధ్వర్యంలో బుధవారం 'వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వృక్ష సంపదను విచక్షణారహితంగా నరకడం వల్ల అటవీ జంతువుల ఉనికి ప్రమాదంలో పడుతోందని, అడవులు, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు చంద్రారెడ్డి, ప్రకాష్, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బూడిద గణేష్‌ను పరామర్శించిన బీఎస్పీ నేతలు

**రామగిరి, అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి) :** ఇటీవల తీవ్ర గుండె నొప్పితో అస్వస్థతకు గురై కరీంనగర్‌లో బైపాస్ సర్జరీ చేయించుకుని ఇంటికి తిరిగివచ్చిన సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు బూడిద గణేష్‌ను బహుజన్ సమాజ్ పార్టీ మంథని నియోజకవర్గ అధ్యక్షుడు జనగామ రవికుమార్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రవికుమార్‌తో పాటు బీఎస్పీ జిల్లా కోశాధికారి పులిపాక బొంద్యాలు, నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఏట సంపత్, బి. రాము పాల్గొన్నారు.

## సీఈఐఆర్‌తో పోయిన ఫోన్ రికవరీ




**కరీంనగర్ క్రైం, అక్టోబర్ 07, (ప్రజాజ్యోతి):** సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు రికవరీ చేశారు. బొమ్మకల్‌లోని చల్మెడ మెడికల్ కళాశాలలో చదువుతున్న డాక్టర్ సాయి ప్రకాశ్ ఇటీవల తన మొబైల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు సీఈఐఆర్ ద్వారా మొబైల్‌ఫోన్ ఆచూకీని సాంకేతికంగా గుర్తించారు. ఫోన్ పెద్దపల్లిలో ఉన్నట్లు గుర్తించి అక్కడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ.నిరంజన్‌రెడ్డి మొబైల్‌ఫోన్‌ను డాక్టర్ సాయి ప్రకాశ్‌కు బుధవారం అప్పగించారు. పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితులకు తిరిగి అందజేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు సిఐ తెలిపారు. ఫోన్ రికవరీలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించిన సాంకేతిక విభాగం కానిస్టేబుళ్లను ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి అభినందించారు.

# సింగరేణి వాస్తవ లాభాలు ప్రకటించాలి

### టీబీజీకేఎస్ ఆర్జీ-3, ఏపీఏ ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య

**రామగిరి, అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి) :** సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, అందులో 36 శాతం వాటాను ఎలాంటి కోతలు లేకుండా కార్మికులకు చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్జీ-3, ఏపీఏ పరిధిలోని గనులు, విభాగాల వద్ద సోమవారం సంఘం నాయకులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ ఆర్జీ-3, ఏపీఏ ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య మాట్లాడుతూ కార్మికుల శ్రమతోనే సంస్థకు లాభాలు వస్తున్నాయని, అభివృద్ధి నిధుల పేరుతో లాభాల వాటాలో కోతలు విధించడం వల్ల కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. 2023--24, 2024--25 ఆర్థిక సంవత్సరాల్లో అభివృద్ధి పేరుతో రూ.6,323 కోట్లు పక్కన పెట్టినట్లు పేర్కొంటూ, ఆ నిధులను ఏ విధంగా వినియోగించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. దసరాకు ముందే 36 శాతం లాభాల వాటాను కార్మికులకు చెల్లించాలని, ఆలస్యం చేస్తే కార్మికులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, పిట్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



# వరుస బైక్ చోరీలకు చెక్

### నలుగురు నిందితుల అరెస్టు
### 19 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**కరీంనగర్ క్రైం, అక్టోబర్ 07, (ప్రజాజ్యోతి):** నగరంలో వరుసగా ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ముఠాను కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ సృజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన మంగలి విజయేందర్‌రెడ్డి (33), కారి స్వామి (27)లను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీల విషయం వెలుగులోకి వచ్చింది. వీరిద్దరూ కలిసి కరీంనగర్, ఎల్ఎండీ, వేములవాడ తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. వీరి సమాచారంతో మరో ఇద్దరు నిందితులైన షేక్ ముజీబ్ హుస్సేన్ (33), సయ్యద్ అబ్దుల్ హామిద్ (38)లను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి మొత్తం 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనాలు కరీంనగర్ రెండో, మొదటి, మూడో ఠాణాలతో పాటు ఎల్ఎండీ, వేములవాడ ఠాణాల పరిధిలో చోరీకి గురైనవిగా గుర్తించారు. నిందితులపై సంబంధిత పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నట్లు సిఐ తెలిపారు. చోరీ వాహనాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో నిందితులు పోలీసులకు చిక్కినట్లు పేర్కొన్నారు.




## చిన్న బతుకమ్మకు పకడ్బందీ ఏర్పాట్లు: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడ, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** వేములవాడ పట్టణంలో వచ్చే శనివారం నిర్వహించనున్న చిన్న బతుకమ్మ వేడుకలను విజయవంతం చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ లోకేష్‌తో కలిసి పట్టణంలోని ప్రధాన బతుకమ్మ ప్రాంగణాలను, వార్డుల్లో మహిళలు బతుకమ్మ ఆడే ప్రాంతాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేడుకలు జరిగే స్థలాల్లో పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్, తాగునీరు, తగినంత లైటింగ్ వసతులు కల్పించాలని, ప్రాంగణాలను చదును చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పండుగను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఓ అన్వేష్, మున్సిపల్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



## పాడి రైతుల చెమట చుక్కల సొమ్ము స్వాహా ?

### 170 మంది పాడి రైతులకు శటకోపం

### పాత అధ్యక్షుడు పై పోలీసులకు ఫిర్యాదు

**కోనరావుపేట, అక్టోబర్.07(ప్రజా జ్యోతి)** కోనరావుపేట మండలం మర్తనపేట పాల ఉత్పత్తి కేంద్రానికి చెందిన 170 మంది పాడి రైతుల పొదుపు, కమిషన్ డబ్బులకు సంబంధించిన రూ.11,19,227ల లెక్కలు వెల్లడించడం లేదని ఆరోపిస్తూ రైతులు కోనరావుపేట పోలీసులను ఆశ్రయించారు. పాల ఉత్పత్తి కేంద్రం పాత అధ్యక్షుడు సూర్యంపై రైతులు ఫిర్యాదు చేశారు. పాల ఉత్పత్తి కేంద్రానికి సంబంధించిన నిధుల లెక్కలు పూర్తిగా చూపించి, నూతన అధ్యక్షుడికి బాధ్యతలు అప్పగించాలని పలుమార్లు కోరినా స్పందించడం లేదని రైతులు ఆరోపించారు. రైతులకు సంబంధించిన డబ్బుల విషయంలో పారదర్శకత పాటించాలని, లెక్కలు వెంటనే వెల్లడించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కోనరావుపేట ఎస్సై రామ్మోహన్‌కు పాడి రైతులు ఫిర్యాదు చేసి, సమస్యపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరోపణలు రుజువు చేయకపోతే చట్టపరమైన చర్యలు తప్పవు...

## సర్పంచ్ బంగుటపు కొమురయ్య

**ధర్మారం,అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి న్యూస్):**
నర్సింగాపూర్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నానని, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారని సర్పంచ్ బంగుటపు కొమురయ్య ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి కోసం చేపట్టిన ప్రతి పనిని గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్, వార్డు సభ్యుల తీర్మానంతోనే చేపట్టినట్లు తెలిపారు.అభివృద్ధి పనులకు సంబంధించిన చెక్కులపై ఉపసర్పంచ్ సంతకాలు చేసిన అనంతరం మాత్రమే బిల్లులు పొందినట్లు పేర్కొన్నారు.అయితే పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించి ఐదు నెలలు గడిచిన తర్వాత తనపై అవినీతి ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని సర్పంచ్ ప్రశ్నించారు.తాను చేపట్టిన ప్రతి అభివృద్ధి పని ప్రభుత్వ నిబంధనలకు లోబడి, పారదర్శకంగా నిర్వహించినట్లు స్పష్టం చేశారు.తనపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఉంటే నిరూపించాలని, నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోనని సర్పంచ్ బంగుటపు కొమురయ్య హెచ్చరించారు. గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజల సహకారంతో నర్సింగాపూర్‌ను మరింత అభివృద్ధి చేస్తానని ఆయన తెలిపారు.




# నిత్యవసర ధరల రేట్లను ప్రభుత్వం నియంత్రించాలి

- ధరల పెంపు తో పేదలకు తీవ్ర ఇబ్బందులు
- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్



**కొత్తపల్లి, అక్టోబర్ 7 ,( ప్రజా జ్యోతి )**
నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమయ్యాయి అని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలు తీవ్రంగా పెరిగిపోతున్నాయని సామాన్యుడు భరించలేని పరిస్థితిలో ఉన్నారని తక్షణమే ధరల నియంత్రణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని లేకపోతే తీవ్ర ఇబ్బందుల పాలు ప్రజలు అవుతారని అన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ రేట్లను పెంచి సామాన్యునికి అందనంత దూరంలో దూసుకుపోయే విధంగా తీవ్ర అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే వస్తువుల ధరలకు కళ్లెం వేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు లక్ష్మీ నారాయణ, రాజేశం,సత్తయ్య,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోయినిపల్లికి మినీస్టేడియం.. యువత సంబరాలు

**రూ.12 కోట్ల నిధుల మంజూరుపై హర్షం..**
**ఎమ్మెల్యే సత్యంకు ఘన స్వాగతం**

**వేములవాడ :అక్టోబర్,7:ప్రజాజ్యోతి.**
బోయినిపల్లి మండల కేంద్రానికి రూ. 12 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణానికి అనుమతులు మంజూరు కావడంతో మండల యువత సంబరాల్లో మునిగిపోయింది. మినీ స్టేడియం మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు యువత, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే సత్యంకు యువత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డప్పు చప్పుళ్లు, డీజే మోతలు, ఉత్సాహభరిత నినాదాలతో ఘన స్వాగతం పలికారు. ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మినీ స్టేడియం మంజూరులో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ చూపారని యువత పేర్కొన్నారు. యువతకు మెరుగైన క్రీడా సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, మినీ స్టేడియం నిర్మాణంతో బోయినిపల్లి యువతకు క్రీడల్లో మరింత ప్రోత్సాహం లభిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లోని



ప్రతిభను వెలికితీసేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మినీ స్టేడియం మంజూరు కావడంతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు నిర్వహించడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. బోయినిపల్లి మండల అభివృద్ధిలో మినీ స్టేడియం మంజూరు మరో కీలక ముందడుగుగా పలువురు అభివర్ణించారు.



## నాయకంపల్లి తండాలో ఘనంగా పోషణ మాసం వారోత్సవాలు

**ధర్మారం, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి న్యూస్):**
ధర్మారం మండలం నాయకంపల్లి తండా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో టీచర్ ఏ.దేవేంద్ర ఆధ్వర్యంలో పోషణ మాసం వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ శైనేని రవి హాజరయ్యారు.ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని, తల్లులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు పిల్లలకు సమతుల్య ఆహారం అందించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోతు దేవమ్మ, ప్రధానోపాధ్యాయులు అనిల్, ఉపాధ్యాయురాలు సుమలత,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బ్లాండిన్, గ్రామ కార్యదర్శి అర్చన రెడ్డి,అంగన్వాడీ టీచర్లు ఏ. దేవేంద్ర,టి. పద్మ, వార్డు సభ్యులు పల్లపు వర్షిని, నవనందుల వెంకటేష్, ఆశా కార్యకర్తలు,తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## నాగారంలో కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీకారం

**కోనరావుపేట, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):**
రైతుల ఇలవేల్పు, చెరువు కట్టను కాపాడే గ్రామ దేవత కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణానికి రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో బుధవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. గ్రామపంచాయతీ పాలకవర్గం, సర్పంచ్ అప్పల నాగభూషణం ఆధ్వర్యంలో పెద్ద చెరువు కట్ట కింద ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామంలో పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని, రైతులకు సాగునీరు సమృద్ధిగా అందాలనే ఉద్దేశంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నామని, అందరి సహకారంతో త్వరలోనే పూర్తి చేస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కీర్తన బ్రహ్మాచారి, వార్డు సభ్యులు, పంచాయతీ పాలకవర్గం, రైతులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# శ్రీధర్ బాబు 27 ఏళ్ల ప్రజా ప్రస్థానం..



## మంథని గుండెల్లో చెరగని ముద్ర

**ఎమ్మెల్యేగా ఐదు పర్యాయాలు.. మంత్రిగా రెండు పర్యాయాలు..**
**ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబు..**

**1999లో మంథని గడ్డపై మొదలైన రాజకీయ ప్రస్థానం.. నేడు 27 ఏళ్ల సుదీర్ఘ ప్రజా ప్రయాణంగా మారింది. తొలి అడుగులోనే విజయాన్ని అందుకుని, ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. మంథని రాజకీయ చరిత్రలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేశారు. ప్రజలతో మమేకమై, నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధాన్ని కొనసాగిస్తూ సాగుతున్న ఆయన రాజకీయ ప్రస్థానం మరో కీలక మైలురాయిని చేరుకుంది..**

--రామగిరి, అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి)



రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాటి నుంచి ప్రజలతో మమేకమై, మంథని నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధాన్ని కొనసాగిస్తున్న రాష్ట్ర మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు రాజకీయ ప్రస్థానం 27 ఏళ్లు పూర్తి చేసుకుంది. 1999లో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన.. అదే ఏడాది సెప్టెంబర్ 18న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి మంథని ఎమ్మెల్యేగా విజయం సాధించి తన రాజకీయ ప్రస్థానానికి బలమైన పునాది వేశారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా ప్రజా జీవితంలో కొనసాగుతూ ఐదు పర్యాయాలు మంథని ఎమ్మెల్యేగా ఎన్నికై, రెండుసార్లు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

### తొలి విజయం.. సుదీర్ఘ ప్రస్థానానికి శ్రీకారం :

మాజీ శాసనసభ స్పీకర్ దివంగత నేత దుద్దిళ్ళ శ్రీపాద రావు అకాల మరణం తర్వాత ఆయన వారసుడిగా 1999 సెప్టెంబర్ 18న మంథని ప్రజలు అందించిన తొలి విజయంతో శ్రీధర్‌బాబు రాజకీయ ప్రయాణం ప్రారంభమైంది. ఆ విజయం ఆయనకు కేవలం ఒక ఎన్నికల గెలుపుగా కాకుండా మంథని ప్రజలతో ఏర్పడిన రాజకీయ అనుబంధానికి నాందిగా నిలిచింది. అనంతరం జరిగిన ఎన్నికల్లోనూ ప్రజల మద్దతుతో ఎమ్మెల్యేగా కొనసాగుతూ నియోజకవర్గ రాజకీయాల్లో తనదైన స్థానాన్ని ఏర్పరుచుకున్నారు.

### ఐదుసార్లు ఎమ్మెల్యే.. రెండుసార్లు మంత్రి :

27 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో శ్రీధర్‌బాబు ఐదుసార్లు మంథని ఎమ్మెల్యేగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర మంత్రిగా రెండుసార్లు బాధ్యతలు చేపట్టి ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

### మంథనితో విడదీయరాని అనుబంధం :

శ్రీధర్‌బాబు రాజకీయ ప్రస్థానంలో మంథని నియోజకవర్గం ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. మూడు దశాబ్దాలకు చేరువైన ప్రజా జీవితంలో నియోజకవర్గ ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారని ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తారని కాంగ్రెస్ కార్యకర్తలు గొప్పగా చెప్పుకుంటారు .

### తెలంగాణ బిల్లుకు శాసన బాట వేసిన శ్రీధర్‌బాబు :

2013 చివర్లో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం చివరి దశలో శాసన వ్యవహారాల మంత్రిగా దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లును అసెంబ్లీ ప్రక్రియలో ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాత్ర ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సాగిన రాజకీయ, శాసన ప్రక్రియలో శ్రీధర్‌బాబు నిర్వహించిన బాధ్యత చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది.

### 27 ఏళ్ల ప్రస్థానానికి అభినందనలు :

1999లో ప్రారంభమైన రాజకీయ ప్రయాణం 2026 అక్టోబర్ 6 నాటికి విజయవంతంగా 27 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబుకు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా జీవితంలో మరిన్ని విజయాలు సాధిస్తూ రాష్ట్ర రాజకీయాల్లో మరింత ఉన్నత బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఐదు పర్యాయాల ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా సాగిన ప్రస్థానం మరో మైలురాయిని చేరుకున్న వేళ.. రాబోయే రోజుల్లోనూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మరిన్ని విజయాలు సాధించాలని, మంథని అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించాలని వారి అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

### శ్రీధర్‌బాబు.. మంథని నుంచి మంత్రివర్గం వరకు

**1999 - 29** ఏళ్ల వయసులో తొలిసారి మంథని ఎమ్మెల్యేగా ఎన్నిక
**2004 -** రెండోసారి ఎమ్మెల్యేగా విజయం.. ఆ టర్మ్‌లో ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు
**2009-** మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపు.. వైయస్సార్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి క్యాబినెట్లో మంత్రిగా బాధ్యతలు..
**2013-14**లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు ప్రక్రియలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా కీలక బాధ్యత
**2018**లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నా మంథని నుంచి విజయం
**2023 -** ఐదోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక.. రేవంత్ రెడ్డి క్యాబినెట్లో ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖల మంత్రిగా బాధ్యతలు..

# అసాంఘిక శక్తులపై పోలీసుల ఉక్కుపాదం

## లక్ష్మీపురం, మల్కాపూర్‌లో కార్డన్ సెర్చ్

కరీంనగర్ క్రైం, అక్టోబర్ 07, (ప్రజాజ్యోతి): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం, మల్కాపూర్ గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్,కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు.రూరల్ ఏసీపీ విజయకుమార్ పర్యవేక్షణలో కొత్తపల్లి ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పోలీసు బలగాలు గ్రామాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి.ప్రతి వీధిలో తనిఖీలు నిర్వహించి అనుమానితుల వివరాలు సేకరించారు.సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఏసీపీ విజయకుమార్ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణలో భాగంగానే తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అపరిచితులు,అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.సైబర్ నేరాలు, మోసపూరిత లింకులు,అనుమానాస్పద ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.ప్రతి కాలనీ,వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు.ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపైనా,అసాంఘిక




కార్యకలాపాలకు పాల్పడే వారిపైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలకు ఏ సమస్య ఎదురైనా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు,పోలీసు సిబ్బంది, ప్రత్యేక బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

# కేజీబీవీలో 8 మంది విద్యార్థినులకు అస్వస్థత

**సమాచారం దాచిన సిబ్బంది..**
**ఆందోళనలో తల్లిదండ్రులు..**

చిగురు మామిడి/అక్టోబర్ 07, ప్రజా జ్యోతి, చిగురుమామిడి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చోటుచేసుకున్న అస్వస్థత ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పాఠశాలలో చదువుతున్న సుమారు ఎనిమిది మంది బాలికలు బుధవారం ఒక్కసారిగా జ్వరం మరియు ఇతర అనారోగ్య సమస్యల బారిన పడ్డారు.ఒకే రోజు ఇంతమంది విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం హాస్టల్ లోని పారిశుద్ధ్యం, తాగునీరు



మరియు ఆహార నాణ్యతపై తీవ్ర సందేహాలకు తావిస్తోంది. అయితే, పిల్లలు అస్వస్థతకు గురైన విషయాన్ని విద్యాలయ సిబ్బంది బాధ్యతారహితంగా వ్యవహరించి తల్లిదండ్రులకు సమాచారం అందించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.పిల్లలకు తక్షణ వైద్య పరీక్షలు నిర్వహించారా..? ఆసుపత్రికి తరలించారా..? లేదా అనే విషయాలపై అధికారులు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. బాలికల ఆరోగ్య భద్రతతో చెలగాటమాడుతున్న సిబ్బందిపై సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యా, వైద్య శాఖ అధికారులు తక్షణమే స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# ఘనంగా బిజెపి 'సంకల్ప సభ' 'సేవా జ్యోతి'

కరీంనగర్ టౌన్,అక్టోబర్ 7(ప్రజాజ్యోతి) ప్రధాని మోదీ జన్మ దినోత్సవము, సేవా సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం రోజున బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలోకరీంనగర్ లో 'సంకల్ప సభ' 'సేవా జ్యోతి' కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కేంద్ర మంత్రివర్యులు కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రోగ్రాంలో భాగంగా ముందుగా కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ నుండి హౌసింగ్ బోర్డ్ చౌరస్తా వరకు బీజేపీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తా వద్ద పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక స్క్రీన్ ద్వారా దేశ ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ల



సందేశాన్ని వర్చువల్ బీజేపీ శ్రేణులు ఆసక్తిగా వీక్షించారు. పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై ప్రధాని మోదీ చేసిన సూచనలను పార్టీ శ్రేణులు ఆలకించారు. 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించి, దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కరీంనగర్ బిజెపి ఇన్చార్జి, రాష్ట్ర నాయకులు శాంతికుమార్, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, వివిధ మోర్చాల అధ్యక్షులు సంఘ నరేష్, నిర్మల రెడ్డి, శ్రీనివాస్ నాయక్, బత్తుల లక్ష్మీనారాయణ, ఆకుల రాజేందర్, మోతె గంగారెడ్డి లతోపాటు కార్పొరేటర్లు, జోన్, మండల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎస్సీ బాలుర వసతిగృహం ఆకస్మికతనిఖీ.

**షెడ్యూలకులాల అభివృద్ధి అధికారి ఎం రవీందర్.**

కాల్వ శ్రీరాంపూర్ అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి) కాలువశ్రీరాంపూర్ మండల కేంద్రంలో గల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఎం రవీందర్ గురువారం రోజున ఆకస్మిక తనిఖీ చేశారు . మేను ప్రకారంగా అన్ని రకాలుగా ఇస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మేను ప్రకారంగా ఇస్తున్నారని జరపడంతో వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట షెడ్యూల్ కులాల సహాయక అభివృద్ధి అధికారి ఎల్ వెంకటస్వామి. వార్డెన్ సత్యనారాయణ. తదితరులు ఉన్నారు.



## సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ ను సన్మానించిన రాష్ట్ర ప్రభుత్వ విప్

వేములవాడ,అక్టోబర్,7:ప్రజాజ్యోతి. వేములవాడ పట్టణంలో మంగళవారం జరిగిన వేములవాడ డివిజన్ ఆటో యూనియన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించిన సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు ఎల శ్రీనివాస్, కొండ శేఖర్,కోక్కుల బాలకృష్ణ, తోట రాజు,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కూరగాయల కొమురయ్య, పులి రాంబాబు గౌడ్, నాయకులు, నాగరాజు, షాబీర్ ,దూలం భూమేష్ గౌడ్,దండుగుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## నాచుపల్లి జేఎన్టీయూలో ప్రాంగణ నియామకాలు

కొడిమ్యాల, అక్టోబర్ 07,(ప్రజాజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూలో హైదరాబాద్‌కు చెందిన ఎక్సెల్‌ఆర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన



ప్రాంగణ నియామకాల్లో 21 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 6, 7 తేదీల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించగా సీఎస్ఈ, ఐటీ విభాగాలకు చెందిన 17 మంది బీటెక్, నలుగురు ఎంటెక్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని, ఎంపికైన వారికి ఏడాదికి రూ.3.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వేతన ప్యాకేజీ అందనుందని సంస్థ హెచ్ఆర్ ఎ.అవినాష్ తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. జి. నరసింహ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డా. బి. సతీష్‌కుమార్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే పల్లె పల్లెకు పొన్నం అన్న

## పల్లె పల్లెలో ప్రజా పాలన





**చిగురుమామిడి /అక్టోబర్ 7, ప్రజా జ్యోతి,**

చిగురుమామిడి మండలంలోని ముది మాణిక్యం, రామంచ, ముల్కనూర్, పీచుపల్లి, సీతారాంపూర్ గ్రామాల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 'పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గ్రామ ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా పాలనలో భాగంగా రెండు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పెన్షన్లు, గృహజ్యోతి ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సబ్సిడీ, మహిళా సంఘాలకు సున్నా వడ్డీ, బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి రుణాలు అందుతున్నాయని మంత్రి తెలిపారు. రైతులకు రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, సన్న వడ్ల బోనస్, అర్హులకు కళ్యాణలక్ష్మి, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాల ప్రయోజనాలు అందుతున్నాయన్నారు. పీచుపల్లిలో రూ.40 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, రూ.5 లక్షలతో పాఠశాల కిచెన్ షెడ్, రూ.10 లక్షలతో వీవో భవనం, పీచుపల్లి--పర్లపల్లి మధ్య సీడీ వర్క్‌కు రూ.80 లక్షలు కేటాయించామని తెలిపారు. సీతారాంపూర్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్, పాఠశాల మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు రూ.10 లక్షలతో వీవో భవనానికి శంకుస్థాపన చేసినట్లు మంత్రి వివరించారు. పీచుపల్లి గ్రామాన్ని సోలార్ విద్యుత్ వినియోగంలో ఆదర్శంగా నిలపాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రతి ఇంటి వద్ద సోలార్ ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. రూ.2 లక్షల సోలార్ వ్యవస్థకు సబ్సిడీ, బ్యాంకు రుణ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు, పాడి పరిశ్రమ, పశు పోషణపై దృష్టి సారించి అదనపు ఆదాయం పొందాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ మొక్కలు, డ్రిప్ సదుపాయం కల్పిస్తోందన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత, ప్రతి పొలంలో పంటకుంట, ప్రతి గ్రామంలో ఊరుకుంట నిర్మించుకోవాలని సూచించారు. మహిళా సంఘాలకు రుణ పరిమితిని పెంచి ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు మెగా హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని, బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సూచించారు. 14 ఏళ్లు నిండిన బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సిన్ వేయించాలని తెలిపారు. అంగన్‌వాడీల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నామని చెప్పారు. చిగురుమామిడి మండల కేంద్రానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైందని, విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. పీచుపల్లి, సీతారాంపూర్ గ్రామాల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, బస్సు సౌకర్యం, వ్యవసాయ రహదారులు తదితర సమస్యలను ప్రజాప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను అధికారులతో సమన్వయం చేసి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం, గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం, రైతులు--మహిళలు--యువతకు అండగా నిలవడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో షర్మిల, పీచుపల్లి సర్పంచ్ పీచు సత్యనారాయణ రెడ్డి, సీతారాంపూర్ సర్పంచ్ గోగూరి లక్ష్మీ, పీఏసీఎస్ చైర్మన్ రవీందర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ వైస్ చైర్మన్ బత్తుల వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో రియాజ్‌కు కీలక బాధ్యతలు

### జగిత్యాల జిల్లా జనరల్ సెక్రటరీగా నియామకం



**కోరుట్ల, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):**

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా కోరుట్లకు చెందిన మాజీ కౌన్సిలర్, సీనియర్ నాయకుడు ఎం.డి. రియాజ్ నియమితులయ్యారు. కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు సూచనల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య ఆదేశాలతో ఈ నియామకం జరిగింది. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన రియాజ్, పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. రియాజ్ నియామకం పట్ల కోరుట్ల కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

## రైతుల సంక్షేమానికి పీఏసీఎస్‌లు సమర్థవంతంగా పనిచేయాలి

### ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**రాయికల్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):**

రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) మరింత సమర్థవంతంగా పనిచేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించిన పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన చైర్మన్ మద్రిపల్లి శ్రీనివాస్ గౌడ్ మరియు పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో సేవలు అందిస్తూ, వారి ఆర్థిక ప్రగతికి సహకార సంఘాలు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రవీంద్రరావు, స్థానిక సర్పంచ్, పీఏసీఎస్ డైరెక్టర్లు మరియు కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

